క్లుప్తంగా

యువ టూరిజం క్లబ్ ప్రారంభం



యువ టూరిజం క్లబ్ బ్యానర్‌తో ఎఫ్‌సీఐ అధ్యాపకులు, సిబ్బంది

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఐ)లో యువ టూరిజం క్లబ్‌ను సోమవారం ప్రారంభించారు. దీనిలో ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల కో ఆర్డినేటర్లు ఇద్దరు(ఒక బాయ్, ఒక గర్ల్)తోపాటు అధ్యాపకులతో కలసి ఐదుగురు సభ్యులుగా ఉన్నారు. దీని కోసం బ్యానర్ తయారు చేసి ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వి.రమణ మాట్లాడుతూ యువ టూరిజం క్లబ్ ద్వారా ప్రజలకు, నగరానికి వచ్చే టూరిస్టులకు కేంద్ర, రాష్ట్ర టూరిజంపై అవగాహన కల్పిస్తారన్నారు. దీనివల్ల టూరిజంలో యువతకు కలిగే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో టూరిజం జిల్లా అధికారి దాస్, అధ్యాపకులు రవి, పార్థసారధి, సిబ్బంది దివ్య, మహాలక్ష్మి, కృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వర్షపు నీటి నిల్వల నిర్వహణపై వర్క్‌షాప్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఉన్నత భారత్ అభియాన్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.వి.రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నీటి నిల్వల నిర్వహణపై అందరికీ అవగాహన అవసరంపై చర్చించామన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించామన్నారు. ఏయూ ఆచార్యుడు నాగరాజు మాట్లాడుతూ కళాశాల ఉన్నత విద్యా సంస్థల గ్రామీణ అభివృద్ధిలో విద్యార్థులు పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఐక్యూ ఏ సమన్వయకర్త రవిబాబు, పోలా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌ల్లో విజిలెన్స్ తనిఖీలు



పెట్రోల్ నాణ్యతను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ స్వరూపారాణి

ఎంవీపీకాలనీ: జిల్లా విజిలెన్స్ అదనపు ఎస్పీ స్వరూపారాణి ఆధ్వర్యంలో సోమవారం మద్దిలపాలెం బీపీసీఎల్, అనకాపల్లి ఎస్సార్ పెట్రోల్ బంక్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. పెట్రోల్, డీజిల్ శాంపిళ్లను విజిలెన్స్ అధికారులు సేకరించారు. ఆయా పెట్రోల్ బంకుల్లో కల్తీ జరుగుతున్నట్లు వస్తున్న ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు స్వరూపారాణి తెలిపారు. తనిఖీల్లో సీఐ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

హిందీ హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ (చెన్నై) సెప్టెంబరులో నిర్వహించే హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 5 వరకు గడువు పెంచారు. ఆంధ్ర, తెలంగాణలో వర్షాల కారణంగా రూ.10 అపరాధ రుసుముతో ఈ గడువు పెంచినట్టు నిర్వాహకులు ప్రకటించారు. మిగిలిన వివరాలకు 89858 97419లో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు కోరారు.

ప్రజారోగ్యానికి భరోసా

- ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు
- అందుబాటులో అన్ని రకాల పరీక్షలు, మందులు
- జోన్–2లో 4, జోన్–3లో 2 హెల్త్ సెంటర్ల సేవలు



ఆరిలోవ కాలనీ యూపీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ సుమన్‌చంద్ర



ఆరిలోవ కాలనీ ఆరోగ్య కేంద్రంలో గర్భిణికి రక్తం ఎక్కిస్తున్న స్టాఫ్ నర్స్



11వ వార్డు బాలాజీనగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

ఆరిలోవ: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. పేదలందరికీ వైద్యం అందుబాటులో ఉండాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గంలో ఆరు చోట్ల గల డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ) రోగులకు మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నాయి. నియోజకవర్గ పరిధి జీవీఎంసీ జోన్–2లో 4, జోన్–3లో 2 మొత్తం 6 ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. జోన్–2 పరిధి 10వ వార్డు ఆదర్శనగర్‌లోని వివేకానందనగర్, 11వ వార్డు బాలాజీనగర్, 13వ వార్డు ఆరిలోవ కాలనీ, శ్రీకృష్ణాపురం ప్రాంతాల్లో సుమారు నాలుగు నెలలుగా ఇవి సేవలు అందిస్తున్నాయి. జోన్–3 పరిధి 16వ వార్డు ఇసుకతోట, 20వ వార్డు చినవాల్తేరులో యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో మందులు, వైద్య సిబ్బంది, ల్యాబ్‌లు, 10 పడకలు, సమావేశ గది, మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి నిత్యం ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. నివాసాలకు దగ్గరలో ప్రభుత్వ ఆస్పత్రులు అందుబాటులో ఉండటంతో దూర ప్రాంతాలకు వ్యయప్రయాసలతో వెళ్లాల్సిన అవసరం లేకుండా చెంతనే మంచి వైద్యం అందుతోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య పరీక్షలు, సౌకర్యాలు, సిబ్బంది

అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఒకే తరహాలో వైద్య సేవలు అందుతున్నాయి. అవసరమైన మందులు, వైద్య సిబ్బంది, పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

ఫ్యాక్ట్ చెక్

- ప్రతి యూపీహెచ్‌సీలో ఏడుగురు వైద్య సిబ్బంది ఉన్నారు. వారిలో ఒక వైద్యాధికారి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ అసిస్టెంట్, ఒక ఫార్మాసిస్టు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక అటెండర్ ఉన్నారు.
- వారానికి ఒక స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వచ్చి సేవలందిస్తున్నారు.
- గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ రోజుకు ఒకరు చొప్పున ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంటున్నారు.
- ప్రతి యూపీహెచ్‌సీలో 10 పడకల చొప్పున అందుబాటులో ఉంచారు. ల్యాబ్‌లో బీపీ, మధుమేహం, డెంగ్యూ, క్షయ, హిమోగ్లోబిన్, మలేరియా, ఫిట్స్, ఆయాసం తదితర వాటికి సంబంధించిన పరీక్షలు రోజూ నిర్వహిస్తున్నారు.
- ప్రతి ఆస్పత్రిలో మందులు నిల్వ ఉంచే గది, అందులో రోగులకు మందులు ఉచితంగా అందించే ఫార్మసిస్టు అందుబాటులో ఉన్నారు. జ్వరాలు, బీపీ, దగ్గు, జలుబుతోపాటు ఆర్థోపెడిక్, గైనిక్ తదితర వాటికి సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయి. ఇన్‌పేషెంట్ సేవలు(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు) అందిస్తున్నారు.
- ప్రతి యూపీహెచ్‌సీలో కుక్క కాటు, పాము కాటు వ్యాక్సిన్‌లు సిద్ధం చేశారు.
- యూపీహెచ్‌సీలో విశాలమైన గదులున్నాయి. వైద్యులు రోగులను పరిశీలించే కన్సెల్టెన్సీ గదులు, సమావేశం నిర్వహించే గది, 10 పడకల ఏర్పాటు చేసిన విశాలమైన హాల్, ల్యాబ్, మందుల స్టోర్ రూం, ఫార్మాసిస్ట్ హాల్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలున్నాయి.

వందల మందికి సేవలు

యూపీహెచ్‌సీలు గతేడాది అక్టోబర్ 2 నుంచి సేవలందిస్తున్నాయి. ప్రతి ఆరోగ్య కేంద్రంలో రోజుకు 30 నుంచి 40 వరకు ఓపీ నమోదవుతోంది. వారిలో అవసరమైన 15 నుంచి 20 మందికి వివిధ రకాల పరీక్షలు చేస్తున్నారు. ఒక్కో ఆస్పత్రిలో నెలకు సుమారు 900 మందికి పైగా ఉచితంగా వైద్య సేవలు అందుతున్నట్లు ఆస్పత్రుల వైద్యులు తెలియజేస్తున్నారు.

ఓపీ నమోదు - వైద్య పరీక్షల వివరాలు



ఆరిలోవ కాలనీ యూపీహెచ్‌సీ ఫార్మశీలో నిండుగా ముందులు



ఆదర్శనగర్ ఆరోగ్య కేంద్రంలో ఓపీ నమోదు చేసుకుంటున్న రోగులు

ఆరిలోవ కాలనీ, శ్రీకృష్ణాపురం హెల్త్ సెంటర్లలో.. ఆరిలోవ కాలనీ హెల్త్ సెంటర్‌లో ఈ ఏడాది జూన్‌లో 896 మంది ఓపీ నమోదైంది. వారిలో 850 మందికి ల్యాబ్ పరీక్షలు చేశారు. మరో 16 మందికి కుక్క కాటు వ్యాక్సిన్ వేశారు. జూలైలో 925 మంది ఓపీ నమోదు కాగా.. వారిలో 880 మందికి ల్యాబ్ పరీక్షలు జరిపారు. ఏడుగురుకు కుక్క కాటు వ్యాక్సిన్ వేశారు. శ్రీకృష్ణాపురం యూపీహెచ్‌సీలో ఈ ఏడాది జూన్‌లో 832 మంది ఓపీ నమోదు కాగా.. వారిలో 752 మందికి ల్యాబ్ పరీక్షలు చేశారు. జూలైలో 1,049 మంది ఓపీ నమోదు కాగా వారిలో 901 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు.

ఆదర్శనగర్ యూపీహెచ్‌సీలో..: ఆదర్శనగర్ యూపీహెచ్‌సీలో ఈ ఏడాది జూన్‌లో 880 మంది ఓపీ నమోదైంది. వారిలో 234 మంది రోగులకు 455 ల్యాబ్ పరీక్షలు చేశారు. మరో 15 మందికి ఇన్‌పేషెంట్ సేవలు అందించారు. 16 మందికి కుక్క కాటు వ్యాక్సిన్ వేశారు. జూలైలో 1,143 మంది ఓపీ నమోదు కాగా.. వారిలో 318 మందికి 584 పరీక్షలు చేశారు. మరో 9 మందికి ఇన్‌పేషెంట్ సేవలందించారు. 10 మందికి కుక్క కాటు వ్యాక్సిన్ వేశారు.

బాలాజీనగర్ ఆరోగ్య కేంద్రంలో..: బాలాజీనగర్ ఆరోగ్య కేంద్రంలో ఈ ఏడాది జూన్‌లో 1,085 మంది ఓపీ నమోదైంది. వారిలో 705 మందికి ల్యాబ్ పరీక్షలు చేశారు. మరో 29 మందికి కుక్క కాటు వ్యాక్సిన్ వేశారు. జూలైలో 1,120 మంది ఓపీ నమోదైంది. వారిలో 796 మందికి పరీక్షలు చేశారు. మరో 36 మందికి కుక్క కాటు వ్యాక్సిన్ వేశారు.

సుగర్ పరీక్షలు చేయించు కుంటున్నా..



నేను ఆరిలోవ కాలనీ ఆరోగ్య కేంద్రంలో రోజూ సుగర్ పరీక్షలు చేయించుకుంటున్నాను. మా ఇంటికి ఈ ఆస్పత్రి చాలా దగ్గరగా ఉంది. నడుచుకుంటూ వచ్చి డాక్టర్ బాబుకు చూపించుకుంటున్నాను. నాకు సుగర్ పరీక్ష చేసి మందులు ఇస్తున్నారు. ఆస్పత్రి అందుబాటులో ఉండటం బాగా ఉపయోగపడుతోంది.

– కె.లక్ష్మి, ఆరిలోవ కాలనీ

నన్ను బతికించారు..



నేను రెండేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాను. గతంలో కేజీహెచ్‌కు, విమ్స్‌కు వెళ్లి మందులు వాడాను. ఇప్పుడు ఇంటికి దగ్గరలో ఆస్పత్రి ఉండటంతో రోజూ వచ్చి డాక్టర్‌కు చూపించుకుంటున్నాను. కొన్ని నెలల కిందట ఆస్పత్రి దగ్గరలో బీపీ, సుగర్ ఎక్కువై పడిపోయాను. అందరూ చనిపోయానని వదిలేశారు. ఆస్పత్రి సిబ్బంది నన్ను విమ్స్‌లో చేర్పించారు. అక్కడ డాక్టర్లు నాకు వైద్యం చేయడంతో బాగుపడింది. ఇక్కడ సిబ్బంది తీసుకెళ్లడం వల్లే నేను బతికాను. అప్పటి నుంచి ఇక్కడ వైద్య పరీక్షలు చేస్తూ మందులు ఇస్తున్నారు.

– టి.లక్ష్మణరావు, ఆరిలోవ కాలనీ

నెలనెలా మందులు తీసుకుంటున్నా..



నాకు బీపీ ఉంది. మా ఇంటికి దగ్గరలోని ఆదర్శనగర్ ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్ష చేయించుకొని మందులు వాడుతున్నాను. నెలకు సరిపడగా ఒకసారి మందులు ఇస్తారు. అవి అయిపోయిన వెంటనే ఆస్పత్రికి వచ్చి తీసుకుంటున్నాను. ఇక్కడ వైద్యులు బాగా వైద్య చేస్తున్నారు. మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నాయి.

– ఎల్.అప్పారావు, సుందర్‌నగర్

సీఎం పాలనలో పేదల కళ్లల్లో ఆనందం

- వైఎస్సార్‌సీపీ 'తూర్పు' సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల
- 16వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల

మద్దిలపాలెం: పేదల కళ్లల్లో ఆనందం చూడాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పేర్కొన్నారు. 16వ వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. లబ్ధిదారులను అడిగి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విజయనిర్మల మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే సంకల్పంతోనే సీఎం వైఎస్ జగన్ వలంటీర్ వ్యవస్థను రూపొందించారన్నారు. వలంటీర్ల సేవలతో సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల చెంతకు చేరడాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు లేనిపోని ఆరోపణలు చేసి అభాసు పాలవుతున్నారని ఎద్దేవా చేశారు. వలంటీర్ల సేవల గురించి లబ్ధిదారులకే తెలుస్తుంది కాని.. అనర్హులకు కాదన్నారు. పేదలకు సొంతిళ్లు, అనేక సంక్షేమ పథకాలు ఇవ్వడాన్ని చూసి.. ఇక రాజకీయ భవిష్యత్తు ఉండదనే మనోవేదనతో ప్రతిపక్షాలు కుతంత్రాలు పన్నుతున్నాయని ఆరోపించారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని.. కుట్రలు పన్నుతున్న నాయకులకు వారే సరైన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

ఎంవీపీకాలనీ: విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం కార్యక్రమాలు సోమవారం కొనసాగాయి. వైదిక ధర్మ ప్రకారం ఈ సంస్థలు ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో ఈ ఆధ్యాత్మిక, శ్రీవారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం వేంకటేశ్వరస్వామికి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వసంతోత్సవం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వారికి నిర్వాహకులు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 2 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. మంగళవారం శ్రీరామచంద్రమూర్తికి అభిషేకం, సాయంత్రం కల్యాణం నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆరిలోవ: బీచ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆరిలోవ ఎస్‌ఐ జి.అప్పారావు తెలిపిన వివరాలిలా.. పెదజాలరిపేటకు చెందిన బలిశెట్టి జోగేంద్ర(18) అతడి స్నేహితుడు అరుణ్‌కుమార్‌తో కలిసి బైక్‌పై ఆదివారం రుషికొండ వైపు వెళ్తున్నాడు. సాగర్‌నగర్ దాటిన తర్వాత ఇస్కాన్ ఆలయం వద్ద బైక్ అదుపు తప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకుపోయింది. ఈ క్రమంలో కిందపడిన జోగేంద్రకు తీవ్ర గాయాలు కాగా.. వెనుక కూర్చొన్న అరుణ్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిద్దరినీ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడికి చేరేసరికే జోగేంద్ర మృతి చెందాడు. సోమవారం అతడి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

మణిపూర్ మారణకాండపై నిరసన



పెదగదిలి జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న మహిళలు, సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థినులు



ఆరిలోవలో ర్యాలీ చేస్తున్న మహిళలు

ఆరిలోవ: మణిపూర్‌లో మహిళలపై జరిగిన హింసాకాండకు నిరసనగా విశాఖ, మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ ట్రస్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో సోమవారం ఆరిలోవలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు ప్లకార్డులు పట్టుకొని ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద ప్రారంభించిన ఈ ర్యాలీ టి.ఐ.సి. పాయింట్, బాలాజీనగర్, తోటగరువు మీదుగా పెదగదిలి కూడలి వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్లు సాగింది. అనంతరం అక్కడి జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు తరలి రావడంతో కూడలి నిండిపోయింది. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మహిళలపై హింసాకాండకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆరిలోవ సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థినులు పాల్గొని మహిళల హింసాకాండకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ నిర్వాహకులు సిస్టర్ అనమరియా, సిస్టర్ అనిత మాట్లాడుతూ మణిపూర్ మారణ హోమాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దోషులను శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం పెదగదిలిలోని మేయర్ క్యాంప్ కార్యాలయానికి చేరుకొని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిస్టర్ సోని, సిస్టర్ నిర్మల, సిస్టర్ రోజ్‌జోస్, సొసైటీ పాలక వర్గ సభ్యులు, సెయింట్ ఆన్స్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన సదస్సు



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ

విశాఖ లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయసేవ సదన్‌లో హ్యూమన్ ట్రాఫికింగ్, దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ ప్రసంగించారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, మహిళా సాధికార అధికారి బి.వెంకటేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్య పద్మ, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మోహన్ లక్ష్మి, సభ్యులు డాక్టర్ బాబీ, ఎం.జేసుదాసు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బోటు షికారు నిలిపివేత

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో బోటు షికారును ప్రస్తుతం నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సముద్రంలో అలల ఉధృతి తీవ్ర స్థాయిలో ఉండటం, బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం దృష్ట్యా బోటు షికారు నిలిపేస్తున్నామని, వాతావరణం అనుకూలించిన తరువాత కొనసాగిస్తామన్నారు.

శ్రీకాంత్‌నగర్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం



రోడ్డుకు అడ్డంగా ఉన్న నివాసాలను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సిబ్బంది



బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వరరావు

ఆరిలోవ: స్థానిక శ్రీకాంత్‌నగర్‌లోని డబుల్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మించినప్పుడు చినగదిలి ప్రాంతంలోని నిర్వాసితులకు జీవీఎంసీ అధికారులు శ్రీకాంత్‌నగర్ లేవుట్ వేసి నివాస స్థలాలు కేటాయించారు. దీనిలో విశాలమైన రోడ్లు నిర్మించారు. ప్రధాన రహదారిగా డబుల్ రోడ్డు నిర్మించారు. దీనికి ప్రారంభంలో పార్వతీనగర్ గెడ్డ వద్ద కొన్ని నివాసాలు అడ్డుగా ఉన్నాయి. వాటి పరిష్కారం వ్యవహారంలో రెండు దశాబ్దాలుగా జీవీఎంసీ అధికారులు, నిర్వాసితులకు సయోధ్య కుదరకపోవడంతో ఇంతవరకు ఇక్కడ సమస్యగా మారింది. రోడ్డు ప్రారంభంలోనే ఇరుగ్గా మారింది. ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన ఈ సమస్యకు ఇప్పుడు మేయర్ గొలగాని హరివెంకటకుమారి కృషితో పరిష్కారం లభించింది. ఆమె జీవీఎంసీ అధికారులతో చర్చించి రోడ్డుకు అడ్డంగా ఉన్న నివాసాలకు నష్టపరిహారం అందించే ఏర్పాట్లు చేశారు. దీంతో వీటిని సోమవారం జీవీఎంసీ జోన్–2 ఏసీపీ వెంకటేశ్వరరావు, సిబ్బందితో వచ్చి పొక్లెయిన్‌తో తొలగించారు. ఏడు నివాసాలను తొలగించి రోడ్డుకు క్లియరన్స్ చూపించారు. నివాసులకు నివాసాలకు ఖర్చుతోపాటు నివాస స్థలానికి నాలుగు రెట్లు టీడీఆర్‌లు మంజూరు చేసినట్లు ఏసీపీ వెంకటేశ్వరరావు తెలిపారు. నష్టపరిహారంగా నగదు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశామన్నారు. టీడీఆర్‌లు అందిస్తామని చెప్పారు. దీంతో ఏ ప్రభుత్వంలో జరగని మోక్షం ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కలగిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆరిలోవకు చెందిన వ్యక్తి నగర మేయర్ కావడంతో ఈ సమస్య పరిష్కారమైందని అంటున్నారు.

శ్రీవారికి వెండి కుందుల బహూకరణ



వెండి కుందులను తీసుకొస్తున్న మావూరి వెంకటరమణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ రూ.7 లక్షలు విలువ చేసే వెండి కుందులను బహూకరించారు. మంగళవాయిద్యాల నడుమ వెండి కుందులను తీసుకొచ్చి అంతరాలయంలో శ్రీవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఏఈవో జగన్మోహనాచార్యులు, టీటీడీ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

17 నుంచి శ్రావణ మాసం పూజలు



డాబాగార్డెన్స్: ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు శ్రావణమాసం పూజలు జరగనున్నాయి. కనమహాలక్ష్మి దేవస్థానంలో నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు(దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుంది. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రాలు, మహాప్రసాదం అందజేస్తారు. పూజా రుసుంను అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచిలో చెల్లించాలని ఆలయ ఈవో శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. పూర్తి వివరాలకు 0891–2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించాలన్నారు. పూజలో పాల్గొనలేని భక్తుల గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటికి పంపనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

వైఎంసీఏ సౌత్ ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా రొనాల్డ్ విలయమ్స్



బీచ్ రోడ్డు: వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్‌లో విశాఖ వైఎంసీఏకు చెందిన నలుగురికి చోటు లభించింది. వైఎంసీఏ సౌత్‌ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా మరోసారి రొనాల్డ్ విలియమ్స్ ఎంపికయ్యారు. సోమవారం జరిగిన వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో రోనాల్డ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేషనల్ కౌన్సిల్ వైస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ బెట్సీ విలియమ్స్, ఈసీ సభ్యులుగా డాక్టర్ కృపానందకుమార్, విజయ్‌ప్రదాన్ ఎన్నికయ్యారు.